---

## సర్వాంతరాత్ముడవు శరణాగతుడ నేను

ప|| సర్వాంతరాత్ముడవు శరణాగతుడ నేను | సర్వాపరాధినైతి చాలుజాలునయ్యా ||

చ|| వూరకున్న జీవునికి వొక్కొక్క స్వతంత్రమిచ్చి | కోరేటియపరాధాలు కొన్ని వేసి |

నేరకుంటే నరకము నేరిచితే స్వర్గమంటూ | దూరువేసేవింతేకాక దోషమెవ్వరిదయ్యా ||

చ|| మనసు చూడవలసి మాయలు నీవే కప్పి | జనులకు విషయాలు చవులుచూపి |

కనుగొంటే మోక్షమిచ్చి కానకుంటె కర్మమిచ్చి | ఘునము సేసేవిందు కర్తలెవ్వరయ్యా ||

చ|| వున్నారు ప్రాణులెల్లా నొక్కనీగర్భములోనే | కన్నకన్న భ్రమతలే కల్పించి |

యిన్నిటా శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నిట్టె | నిన్ను నన్ను నెంచుకుంటే నీకే తెలియునయ్యా ||

www.telugulyrics.org



Contributed By: Somayajulu Sistla